# మూడోసారి ఆశీర్వదించాలి

- దుబ్బాకలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిందేమీలేదు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- రాయపోల్ రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి



గత ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజలకు ఇచ్చిన హామీల మ్యానిఫెస్టోను రాయపోల్ రోడ్‌షోలో వివరిస్తున్న మంత్రి హరీశ్‌రావు



రాయపోల్‌లో రోడ్‌షోకు తరలివచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు

రాయపోల్, నవంబర్ 17 : ముచ్చటగా మూడోసారి ఆశీర్వదించాలని ఆర్థిక, వైద్యా రోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రజలను కోరారు. కాంగ్రెస్‌పార్టీకి ఓటువేస్తే కరెంట్ కష్టాలు వస్తాయని, బీజేపీకి వేస్తే మోటర్లకు మీటర్లు తప్పవన్నారు. శుక్రవారం సాయంత్రం రాయపోల్ మండల కేంద్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కారుగుర్తుకు ఓటు వేసి మంచి మనిషి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ప్రజలు మోసపోయి గోస పడ్డారని, ఓటు ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలిచిన తర్వాత పేదలకు చేసిందేమీలేదని విమర్శించారు.రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, బీజేపీ,కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మిమోసపోకుండా కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు ఎందుకు అమలు కావడంలేదని, తెలంగాణలో మూడు గంటల కరెంట్ ఇస్తామన్న పార్టీని భూస్థాపితం చేయాలన్నారు. 60 ఏండ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేండ్లలో చేసి చూపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని పదికి పది సీట్లు బీఆర్‌ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కాంగ్రెస్,బీజేపీలకు ఓట్లు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రజలకు అండగా ఉంటున్న బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందించే అవకాశం ఉంటుందన్నారు.ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని పథకాలు సీఎం కేసీఆర్ అమలు చేయడంతో నెంబర్‌వన్ రాష్ట్రంగా గుర్తింపుపొందిందన్నారు.పేదల అసైన్డ్ భూములకు పట్టాలు అందించి పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన మ్యానిఫెస్టోను చూస్తే 420లాగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో లేనిపథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రవేశపెట్టిందని ప్రజలు ఆపార్టీని తిరస్కరించడం ఖాయమన్నారు.కొత్తగా ఏర్పడిన రాయపోల్ మండలాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందామని, కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీలో గెలిపించాలని కోరారు. రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాలను ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి తనయుడు పృథ్వీకృష్ణారెడ్డి, జడ్పీటీసీ యాదగిరి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, రైతు బంధు సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్, ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్పలక్ష్మి, రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

# నేడు చేర్యాలకు జనహృదయ నేత

- చేర్యాలలో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ
- భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి
- నెరవేరనున్న చేర్యాల ప్రజల ఆకాంక్షలు
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రాజయ్య
- భారీ జన సమీకరణకు సన్నాహాలు
- సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు



చేర్యాలలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, తాటికొండ రాజయ్య తదితరులు



చేర్యాలలో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభా వేదిక

చేర్యాల, నవంబర్ 17 : సీఎం కేసీఆర్ చేర్యాలకు రానుండడంతో ఈప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేరనున్నాయని, నియోజకవర్గ ప్రజలు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని మార్కెట్ యార్డు పక్కన ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభా స్థలాన్ని, ఏర్పాట్లను ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్యే, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రాజయ్య, స్థానిక నాయకులతో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఇటీవల జనగామలో సీఎం కేసీఆర్ సభ జరిగిందని, చేర్యాల ప్రాంత ప్రజల కోరిక మేరకు శనివారం చేర్యాల పట్టణానికి ముఖ్యమంత్రి మధ్యాహ్నం మూడు గంటలకు రోడ్డు మార్గంలో రానున్నట్లు తెలిపారు.ప్రజాఆశీర్వాద సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనగామ నియోజకవర్గం సభ విజయం కోసం గులాబీ శ్రేణులు కదం తొక్కుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై జనగామ సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, దాన్ని మళ్లీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, ఖచ్చితంగా డివిజన్ సాధించుకుని ముందుకు వెళ్దామన్నారు. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు చేర్యాల ప్రాంతం కేసీఆర్ వెంట నడిచిందని,ఇప్పుడు అదే దారిలో వెళ్లేందుకు సిద్ధంగా ఉందన్నారు.సిద్దిపేట, గజ్వేల్‌లో జెండా ఎత్తితే, ఇక్కడ జెండా ఎత్తారని, అక్కడ గజ్జెకడితే ఇక్కడ గజ్జకట్టి పాటలు పాడి కేసీఆర్‌కు, ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచినట్లు గుర్తుచేశారు. గజ్వేల్ సమీపంలో ఉన్న కేసీఆర్‌కు ఇక్కడి ప్రజలతో సన్నిహిత సంబంధం ఉందని, చేర్యాల అభివృద్ధికి సంబంధించి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అధిక నిధులు తెచ్చుకుందామన్నారు.ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ చెప్పింది వింటారని, బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటారని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని రెండుసార్లు ఎలా ఆదరించారో తనను కూడా ఆదరించాలని, అదే విశ్వాసం నాపై, బీఆర్‌ఎస్ పార్టీపై ఉండాలని కోరారు. జనగామ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి అద్భుతమైన మెజార్టీ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సుశిక్షుతులైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజాఆశీర్వాద సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పల్లా కోరారు.అనంతరం పల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలకు సభ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీటి వసతి, వలంటీర్లు తదితర అంశాల పై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్ నర్సయ్య, మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కిష్టయ్య,జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యుడు మేడిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు చంటి, నరేందర్, సతీశ్, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య పాల్గొన్నారు.

## సీఎం సభకు భారీ ఏర్పాట్లు

చేర్యాల, నవంబర్ 17 : చేర్యాల పట్టణంలో శనివారం బీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ జరగనున్నది. సీఎం కేసీఆర్ హాజరుకానున్న బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. జనగామ నియోజకవర్గంలోని చేర్యాల టౌన్, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, నర్మెట్ట, తరిగొప్పులు, జనగామ టౌన్, జనగామ రూరల్, బచ్చన్నపేట మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలిరానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం కేసీఆర్ సభ హాజరుకానున్నారు. ప్రజలకు తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్స్, విద్యుత్ తదితర వసతులు కల్పించారు.

### పార్కింగ్ స్థలాల ఏర్పాటు

చేర్యాల పట్టణంలోని మార్కెట్ యార్డు పక్కన ఉన్న 10 ఎకరాల స్థలంలో ప్రజా ఆశీర్వాద సభా స్థలాన్ని నిర్ణయించారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. జనగామ నుంచి చేర్యాల వైపునకు వచ్చే బచ్చన్నపేట, జనగామ, నర్మెట్ట, తరిగొప్పుల మండలాల ప్రజల కోసం చేర్యాల, ముస్త్యాల గ్రామాల మధ్య ఉన్న 20 ఎకరాల ఖాళీ ప్రదేశంలో మూడు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.కొమురవెల్లి, చేర్యాల రూరల్ మండలం, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి వచ్చే ప్రజల కోసం పట్టణంలోని కస్తూర్బాగాంధీ సమీపంలో, కేపీఆర్ కాలనీ వెనుక భాగంలో రెండు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. బచ్చన్నపేట మండలంలోని కొన్ని గ్రామాలు, చేర్యాల మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలకు సభా ప్రాంగణానికి సమీపంలో మరో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. సభా స్థలాన్ని, పార్కింగ్ స్థలాలను పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, ప్రభుత్వ మాజీ చీఫ్ విఫ్ బొడకుంటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సీనియర్ నాయకుడు జల్లి సిద్ధయ్య, ఆప్కో రాష్ట్ర మాజీ చైర్మన్ మండల శ్రీరాములు తదితరులు సందర్శించారు.



చేర్యాలలో సీఎం కేసీఆర్ సభాస్థలి వద్ద బందోబస్తు పై చర్చిస్తున్న సిద్దిపేట సీపీ శ్వేత